విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

పడి లేచిన కెరటం

- ఐకమత్యంగా పోరాటం
- అండగా నిలిచిన జనసేన
- పాలనా వైఫల్యాలు... వర్గ పోరుతో నష్టపోయిన వైసీపీ

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల వేళ ఐదేళ్ల జిల్లా రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా తిరగబడింది.. 2019 ఎన్నికల్లో తెదేపా రెండు శాసనసభ స్థానాలు నిలబెట్టుకోగలిగింది. ఈసారి అధికార పక్షంగా బరిలోకి దిగిన వైకాపా పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. అంచనాలకు అందని మెజార్టీతో కూటమి అభ్యర్థులు అపూర్వ విజయం సొంతం చేసుకున్నారు. ఇదంతా రాత్రికి రాత్రి కాలం కలిసొచ్చి జరిగిపోలేదు. దీనివెనుక కూటమిశ్రేణుల నిరంతర శ్రమ దాగి ఉంది. మరోవైపు వైకాపా మితిమీరిన అతివిశ్వాసం, పాలనా వైఫల్యాలు, పార్టీలో వర్గపోరు, అక్రమాలు, సామాన్యులపై దౌర్జన్యాలు, శాంతిభద్రతల సమస్యలు పార్టీని అధఃపాతాళానికి తొక్కేశాయి.

మితిమీరిన ఆత్మ విశ్వాసం

జిల్లాలో వైకాపాకు అధికారం వచ్చాక అదంతా తమ సొంత బలమని, అధికారం శాశ్వతంగా ఉంటుందనే భావన నియోజకవర్గ నేతలలో నెలకొంది. దీనికి తోడు మితిమీరిన ప్రచార ఆర్భాటం తమను తాము అతిగా ఊహించుకొనేలా చేసింది. ఐప్యాక్ బృందాలు నేతల్ని నియంత్రించి నడిపించేలా ఉండటంతో కొన్నిసార్లు వైసీపీ నేతలు క్షేత్రస్థాయిలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వెళ్లలేకపోయారు. సంక్షేమం ప్రతి గడపకు చేరుతున్నందున తమ ఎదురుగా ఎవరు మాట్లాడలేకపోతున్నందున ప్రజలంతా తమవైపే ఉన్నారన్న భ్రమలో గడిపేసారు.

కక్ష సాధింపు చర్యలతో ప్రజలు దూరం

ప్రశ్నించే వారిపై కక్ష సాధింపులు, ఎదురు తిరిగే వారిపై అక్రమ కేసులు బనాయించడం వంటి చర్యలతో ప్రజలు మరింత దూరం అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలలో జరిగిన పరిణామాలు, వచ్చిన విజయాలను చూసి అది తమ బలంగా లెక్కలేసుకోవడం క్షేత్రస్థాయి వాస్తవాలు అధికార పార్టీ నేతలకు తెలియకుండా పోయాయి. వీటికి తోడు ప్రతి నియోజకవర్గంలోనూ వర్గ పోరు పార్టీకి తీరని నష్టం చేసింది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది పార్టీలో అసంతృప్తి జ్వాలల్ని చల్లార్చి బాధ్యత తీసుకునే వ్యవస్థ లేకపోవడం పార్టీని ఎన్నికల్లో అతఃపాతాళానికి పడిపోయేలా చేసింది. స్థానిక ప్రజా ప్రతినిధులకు ఎక్కడా గౌరవం లేకపోవడం, ఎన్నికల సైతం నేతలతో కాకుండా వాలంటీర్లతో నడిపించుకోవాలని ఆలోచన చేయడం, వారితోనే సమావేశాలు జరపడం, వారి ద్వారానే తాయలాలు పంపిణీ చేయడం, ఎన్నికల పట్ల పార్టీ శ్రేణులకు పూర్తిగా ఆసక్తి లేకుండా చేశాయి.

ఓటమి నుంచి విజయ తీరాలకు..

2019 సార్వత్రిక ఎన్నికలలో ఓటమి నుంచి టిడిపి త్వరితగతిన కోలుకుంది. ఓటమిని విశ్లేషించుకుంది. అధినేత చంద్రబాబు సూచనలు మేరకు ప్రజా పోరాటాలకు వేగంగానే రంగంలోకి దిగింది. స్థాపించి 40 సంవత్సరాలు పూర్తయినందున పార్టీ నిర్మాణంలో యువతను భాగస్వాములు చేసింది. కొత్త నాయకత్వాన్ని అన్నిచోట్ల ప్రోత్సహించింది. బూత్ స్థాయి నుంచి యువతకు సామాజిక వర్గాల వారీగా, పార్టీ శ్రేణులకు అవకాశం కల్పించింది. ప్రతి బూత్ స్థాయిలో 30 నుండి 50 మంది వరకు పార్టీ కార్యకలాపాలలో భాగస్వాములను చేసింది. మరోవైపు పార్టీ కార్యక్రమాలను సంఘటితంగా ముందుకు తీసుకువెళ్లడంలో శ్రేణులు సవాలుగా పని చేశాయి. స్థానిక ఎన్నికల బహిష్కరణ తర్వాత నేతల్లో నైరాశ్యం నెలకొన్నప్పటికీ దాని నుంచి వెంటనే బయటికి వచ్చారు. గ్రామస్థాయిలో అధికార పార్టీ నుంచి ఎదురవుతున్న ఒత్తిళ్లు, అవమానాలు, ఇబ్బందులు, అక్రమాలను సంఘటితంగా ఎదుర్కొనేందుకు నియోజకవర్గ స్థాయి నేతలు ముందుకు వచ్చారు. జిల్లాలో ఎక్కడ ఏ ఘటన జరిగినా పార్టీ జిల్లా అధ్యక్షులు, టిడిపి పార్లమెంటు నియోజకవర్గ స్థాయి సభ్యులు, సహా ముఖ్య నేతలు హాజరవుతూ అండగా నిలిచారు. ఎన్నికల ఏడాది బాదుడే బాదుడు, ఇదేం కర్మ మన రాష్ట్రానికి, సూపర్ సిక్స్ ట్వంటీ కార్యక్రమాలతో పాటు టిడిపి సభ్యత్వ నమోదు అంశాలకు ప్రతి ఇంటిని పలుమార్లు సందర్శించారు. వారి ఆలోచనలు, ప్రాధాన్యతలు పరిశీలించి వారితో మమేకమయ్యారు. ప్రజలు, పార్టీ నాయకత్వం సమన్వయంగా కలిసి రావడంతో గట్టి ఓటమి నుంచి బలమైన విజయం వైపు దూసుకెళ్లారు.

అండగా జనసేన

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఓట్ల బదిలీలో జనసేన పూర్తిగా అండగా నిలిచింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన సైనికులకు ఓట్ల బదిలీ విషయంలో స్పష్టమైన దిశా నిర్దేశం చేశారు. దీంతో కూటమి విజయం ఏకపక్షంగా సాగిందనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు నిలుపుదల

విశాలాంధ్ర -ఏలూరు: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును నిలుపుదల చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా నేడు ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు.2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 16వ తేదీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుండి అమల్లోకి వచ్చిన ఈ ప్రవర్తన నియమావళి జూన్ 4న ఓట్ల లెక్కింపు ముగిసిన తదుపరి 48 గంటల వరకు అమల్లో ఉందన్నారు. ఎన్నికల్లో వెలువడిన ఫలితాలను బట్టి రాష్ట్రంలో 25 పీసీలకు, 175 ఏసీలకు నూతనంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఖరారు చేయడంతో రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా ముగియడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును నిలుపుదల చేయడం జరిగిందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.ఈ మేరకు జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును గురువారం సాయంత్రం నుండి నిలుపుదల చేసినట్లు జారీ చేసిన ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని ఆయన తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన మన అందరి బాధ్యత అని ,బాలలకు స్వేచ్ఛా వికాసం కల్పించాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన జిల్లా టాక్స్ ఫోర్స్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి బులికృష్ణ, జె.జె.బోర్డు ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ బి. రచన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో బాగంగా ప్రధానంగా పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్ అవుట్స్ పై దృష్టి సారించాలన్నారు. ఇటుకల పరిశ్రమ, జీడి పరిశ్రమ, చిన్న తరహా పరిశ్రమలు, ఇతర కుటీర పరిశ్రమలను, చిన్న దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసి బాలకార్మికులను గుర్తించాలన్నారు. అదే విధంగా పొగాకు హార్వెస్టింగ్ పనుల్లో కూడా ప్రధానంగా చింతలపూడి, లింగపాలెం తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. పిల్లలు బడికి వెళ్లే పరిస్థితులు ఉన్నాయని ఎట్టి పరిస్థితుల్లో బడిబయట పిల్లలు ఉండేందుకు ఎంతమాత్రం అవకాశం లేదన్నారు. చిన్నతనంలో సంపాదన రుచిచూస్తే ఆపిల్లలు పలు దురలవాట్లకు పాల్పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం అనంతరం ఏ పిల్లలైనా పాఠశాలలకు తిరిగిరాకపోతే వారి ఆచూకి తెలుసుకొని తిరిగి పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలన్నారు. ఏలూరు పవర్ పేట ప్రాంతంలో మేదర కాలనీల్లో కార్మికశాఖ, విద్యా, పోలీస్ బృందం పర్యటించి బాలకార్మికులకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బడి మధ్యలో మానేసినవారి సమాచారం సేకరించి వారి ఇంటికి ప్రత్యేక బృందాలను పంపి తల్లిదండ్రులను చైతన్య పరిచి వారిని తిరిగి పాఠశాలలకు పంపించాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి బులికృష్ణ మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలనచేసే ప్రయత్నం చేయడమే మనముందున్న కర్తవ్యమన్నారు. జె.జె.బోర్డు, ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ బి. రచన మాట్లాడుతూ పనిచేసే పిల్లల సమస్యలను భిన్నకోణాలనుంచి అధ్యయనం చేయా లన్నారు. ఈ సమావేశంలో కార్మికశాఖ డిప్యూటీ కమిషనరు పి. శ్రీనివాస్, డిఆర్డిఏ పిడి డాక్టర్ ఆర్. విజయరాజు, ఐసిడియస్ పిడి కె. పద్మావతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్. త్రినాధరావు, డిఇఓ కె. అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య అమలుకు సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: మిషన్ వాత్సల్య పథకం అమలుకు మరింత సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారు లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొదటి త్రైమాసిక సమావేశం వివిధ శాఖల అధికారులతో జిల్లా బాలల సంక్షేమ, రక్షణ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టరు వె. ప్రసన్న వెంకటేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాదరణకు గురైన బాలలకు విద్యా, ఆరోగ్యం, అభివృద్ధి వంటి అవసరాలకు వాత్సల్య పథకం కింద ఆర్థిక సహాయం అందించబడు తుందన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి బిడ్డకు ఆరోగ్య కరమైన, సంతోషకరమైన బాల్యాన్ని అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. వివిధ కారణాలతో నిర్లక్ష్యానికి గురైన సంరక్షణ అవసరమైన బాలలకు సంబంధించిన అంశాలతో పాటుగా చట్టాన్ని విభేదించే బాలల కు సంబంధించిన కేసుల గురించి ఇతర అంశాలు ముఖ్యంగా బాలల హక్కుల సంరక్షణ కొరకు ఉన్న జాతీయ కమిషన్ వారు నిర్దేశించిన ప్రమాణాలు అమలు చేయడం, ఆన్లైన్ పోర్టల్ లలో డేటా అప్లోడ్ చేయటం, ఫాలో అప్ చేయటం, రిపోర్ట్ చేయటం అన్నీ సమన్వయంతో చేసుకుని పిల్లల అభివృద్ధికి పాటు పడాలని తెలియజేశారు. ఈ సమావేశంలో డి ఎల్ఎస్ ఏ సెక్రటరీ సీనియర్ జడ్జి కెకెవి బులికృష్ణ, జెజె బోర్డు ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ బి. రచన తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థులకు ప్రయోజనం

విశాలాంధ్ర-లింగపాలెం: గ్రంథాలయాలలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలిగిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ధర్మాజీగూడెం గ్రంథాల యంలో జరిగిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని సద్వినియోగించు కున్నారని వక్తలు పేర్కొన్నారు. ఈ శిబిరంలో జనరల్ నాలెడ్జ్,చిత్రలేఖనం, క్విజ్,క్రీడలపై అవగాహన కల్పించి పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ రిసోర్స్ పర్సన్స్ ఏవీ నారాయణ, జ్యోతి ప్రియాంక విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రకాష్ రావు, చిట్టియ్య, బాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందించారు.

కాలువ పూడిక పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర -భీమవరం: భీమవరంలో జరిగే ప్రతి మంచి పనిలో నా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. రాయలం మాజీ సర్పంచ్ కోళ్ల రామచంద్రరావు అధ్వర్యంలో మంచినీరు చెరువులోకెళ్లే పంట కాలువలో పూడిక పనులను శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ భీమవరాన్ని మోడల్ నియోజక వర్గంగా అభివృద్ధి చేసుకుందామని, ప్రతిఒక్కరి సహకారం ఎంతో అవసరమని, ప్రతి అధికారి చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు కోళ్ల సీతారాం, కోళ్ల నాగబాబు, మాజీ ఎంపీటీసీ వినాయక, సోమరాజు, పత్తి హరి, గ్యాస్ శీను, యర్రంశెట్టి శివకృష్ణ, నడింపల్లి శ్రీనివాసరాజు, డాక్టర్ బాబు, వీర మహిళలు తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపవరం సిపిఎఫ్ ఫ్యాక్టరీ ఉద్యోగులకు యాజమాన్యం న్యాయం చేయాలి

ఫ్యాక్టరీ వద్ద ఉద్యోగుల నిరసన

విశాలాంధ్ర- గణపవరం: పశ్చిమగోదావరి జిల్లా గణపవరం (సరిపల్లె) గ్రామంలో గత 11 సంవత్సరాలుగా సిపిఎఫ్ ప్రైవేట్ లిమిటెడ్ ఫీడ్ మిల్లు చేపలు, రొయ్యలు మేతల తయారీ పరిశ్రమ థాయిలాండ్ దేశానికి

చెందిన కంపెనీ భారీ లాభాలతో ఫ్యాక్టరీని నడిపారు. కానీ నాడు భారతదేశ వ్యాప్తంగా నష్టాల్లో ఉందని యాజమాన్యం సాకు ను చూపించి గణపవరం ఫ్యాక్టరీని థాయిలాండ్ యాజమాన్యం మూసి వేసింది. దేశంలో ఉన్న సిపిఎఫ్ గ్రూప్ ఫ్యాక్టరీలు అన్ని రన్నింగ్ లో ఉన్నాయి కానీ గణపవరం ఫ్యాక్టరీని మూసివేశారు. అందులో పని చేసే ఉద్యోగులకు, కార్మికులకు ఫ్యాక్టరీ మేనేజ్మెంట్ వారికి న్యాయమైన పరిహారం అందజేయకుండా ఉద్యోగులు సంతకాలు చేయకుండా వారిని విధుల నుండి తొలగించినట్లు యాజమాన్యం చేసింది. శుక్రవారం దానికి నిరసనగా గణపవరం సిపిఎఫ్ ఫ్యాక్టరీ ఎదుట ఉద్యోగులు, కార్మికులు శాంతియుత నిరసన తెలుపుతున్నారు. ఏ విధమైన ఉద్యోగ భద్రత కల్పించడం జరగలేదని కానీ యాజమాన్యం ఉద్యోగులుగా తీసుకున్న పుడు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని హామీ ఇచ్చింది. కానీ అది నెరవేరకుండానే యాజమాన్యం చేతులు ఎత్తివేసింది ఉద్యోగులు మీద ఆధారపడిన కుటుంబం నడిరోడ్డు మీద వదిలేసింది.22 మే నెల నుండి ఫ్యాక్టరీ గేటుకు తాళాలు వేసి అందులో పనిచేసే ఉద్యోగులను ఫ్యాక్టరీ లోనకు రానివ్వకుండా చేసింది. ఈ సమస్యలకు పరిష్కారంగా జిల్లా అధికారులు ఫ్యాక్టరీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సి పి ఎఫ్ ఫ్యాక్టరీ పనిచేసే ఉద్యోగులు కార్మికులు కోరుతున్నారు.

బైకులు ఢీకొని ఇద్దరు యువకుల మృతి

విశాలాంధ్ర - భీమవరం టౌన్: భీమవరం నుంచి పాలకొల్లు వెళ్లే రోడ్డులో గురువారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది,. భీమవరం చిన్న రంగన్నపాలెంకు చెందిన పెనుగొండ శ్రీను (37) వైఎస్ఆర్సిపి పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమా బాల పర్సనల్ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నాడు, తన డ్యూటీలో భాగంగా గురువారం రాత్రి 11 గంటలకు డ్యూటీ దిగి తన ఇంటికి వెళ్లడానికి అదే గ్రామానికి చెందిన వీరవెల్లి శ్రీనివాస్ (18)ను తన బైక్ పై ఎక్కించుకుని ఇంటికి వెళ్లే రోడ్డు మలుపు తిరిగే క్రమంలో పాలకొల్లు నుండి భీమవరం వైపు (యమహా ఎంటి) మోటారు బైక్ పై ముగ్గురు యువకులు వేగంగా వచ్చి వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో పెనుకొండ శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక ఉన్న వీరవెల్లి శ్రీనుకు బలమైన గాయాలు కావడంతో భీమవరం ఏరియా హాస్పిటల్ కి తరలించగా ప్రాణాపాయ పరిస్థితులో హాస్పటల్లో మృతి చెందాడు, బైక్ పై వచ్చిన ముగ్గురు యువకుల్లో ఇద్దరు యువకులు పారిపోగా ఒక యువకునికి బలమైన గాయాలు తగలడంతో తణుకు లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించినట్టు స్థానికులు చెప్తున్నారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది, సంఘటనకు సంబంధించి వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి సిఐ గుత్తుల శ్రీనివాస్ తెలిపారు.

ప్రభుత్వ కళాశాల భవన నిర్మాణానికి కృషి

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి కృషి చేయనున్నట్టు ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు, సిబ్బంది నూతనంగా ఎన్నికైన ఏలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ (చంటి)ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ మాట్లాడుతూ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేయనున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిపిడిసి సభ్యులు ఎల్. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు వి. వెంకట్ రావు, డాక్టర్ ఎం. రాంబాబు, డాక్టర్ ఎం విజయ్ కుమార్, ఎస్. పరమేశ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర విలేకరి రామకృష్ణ మృతి

- పలువురి దిగ్భ్రాంతి
- సంతాపం తెలిపిన ప్రజా ప్రతినిధులు, కళాకారులు, జర్నలిస్టులు, గ్రామ ప్రముఖులు

విశాలాంధ్ర-టి.నరసాపురం : జిల్లాలోని సీనియర్ జర్నలిస్టులలో ఒకరైన విశాలాంధ్ర విలేకరి తాడిగడప రామకృష్ణ (రాము) మృతి చెందారు. ఆయన మృతికి పలువురు ప్రజా ప్రతినిధులు, కళాకారులు జర్నలిస్టులు, ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రామకృష్ణ గత 20 సంవత్సరాలుగా విశాలాంధ్ర దిన పత్రికలో తనదైన శైలిలో సమాజానికి మేలు కలిగే వార్తలను అందించడంలో దిట్ట అని పలువురు కొనియాడారు. స్థానిక అభ్యుదయ భట్రాజుల సంక్షేమ సంఘం కార్యదర్శిగా రామకృష్ణ కొనసాగుతున్నారు.. రామకృష్ణ మండలంతో పాటు జిల్లాలో పలువురు పాత్రికేయ మిత్రులతో సన్నిహితంగా ఉండేవారు. రామకృష్ణ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారుజామున విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. రామకృష్ణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామకృష్ణ తండ్రి టీవీఎస్ రాజు, సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యుడుగా, ప్రజానాట్యమండలి కళాకారుడుగా కొనసాగుతున్నారు.పలువురు రాజకీయ ప్రముఖులు, కళాకారులు, జర్నలిస్టులు, గ్రామ పెద్దలు రామకృష్ణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య,బి. కె.యం.యు. జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు,సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, జేవి రమణ రాజు, జమ్మి శ్రీనివాసరావు, కంచర్ల గురవయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు, ఉపాధ్యక్షులు గొలిమే బాల యేసు, సిపిఐ చింతలపూడి మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, పుల్లూరు సోమశేఖర ఆచార్యులు,సీనియర్ నాయకులు మామిళ్ళపల్లి వసంతరావు, మాజీ శాసనసభ్యులు ఘంటా మురళీ రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, మాజీ జడ్పిటిసి గంట సుధీర్ బాబు, మాజీ సొసైటీ అధ్యక్షులు ఘంటా సత్యంబాబు, సాయిన కనకరాజు, ఉప సర్పంచ్ నెక్కలపు సూర్యనారాయణ,కోనేరు బుజ్జియ్య, జనసేన నాయకులు బొబ్బిలి వీరబాబు, మానవత సీనియర్ సభ్యులు షేకు ఇబ్రహీం, తోకల రాజేష్, పాత్రికేయులు వేణు, లక్ష్మయ్య, పాపారావు, మురళి, లక్ష్మీనారాయణ, భూషణం, వీరమల్లు మధు, బట్రాజుల సంఘం పెద్దలు కలిదిండి పొలం రాజు, వెంకట నరసింహారావు, చిట్టి రాజు, చిన్న చిట్టి రాజు, తాడిగడప పుల్లం రాజు, ఏలూరు నాగరాజు, ప్రజా కళాకారులు సబ్బి కనకారావు, వీరమల్లు సత్యనారాయణ, ఎల్ఆర్ కృష్ణ బాబు, తిరుపతి రమేష్ బాబు, నరసయ్య, ఐతం మహేష్, వేముల జగన్, నానాది సాగర్, మున్నా ప్రసాద్ రాజు, ఈదర ఆంజనేయులు, సత్యనారాయణ రాజు, నిడదవోలు కృష్ణ, పోసుమంచి ముసలయ్య, కంకిపాటి వెంకటరాజు, కోటిగంటి సత్యనారాయణరాజు, పలువురు రామకృష్ణకు కన్నీటి వీడ్కోలు పలికారు.

విశాలాంధ్ర విలేకరుల సంతాపం

కామవరపుకోట మండల విశాలాంధ్ర విలేకరి తాడిగడప రామకృష్ణ (రాము) అకాల మృతి పట్ల విశాలాంధ్ర ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో బెజవాడ బ్రహ్మయ్య ప్రగాఢ సంతాపం, కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. రామకృష్ణ తండ్రి, సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టివిఎస్ రాజు ఇంటి వద్ద రామకృష్ణ మృతదేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి రామకృష్ణ తండ్రి టివిఎస్ రాజు తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. విశాలాంధ్ర ఏలూరు, ద్వారకాతిరుమల, టి. నరసాపురం, కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం విలేకరులు ఎం . మాణిక్యాలరావు,నాగరాజు,యు ప్రసాద్ బాబు, కృష్ణ బాబు, ఎం రమేష్ తదితరులు రామకృష్ణ భౌతిక కాయానికి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రానివ్వద్దు

-మున్సిపల్ అధికారులకు సూచించిన ఎమ్మెల్యే బొలిశెట్టి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఏ విధమైన ఇబ్బంది వచ్చినా సహించేది లేదని జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం పరిశీలనకు వెళ్ళిన ఆయనకు శుక్రవారం మున్సిపల్ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు, వీధిలైట్లు, పారిశుద్ధ్యం తదితర అంశాల్లో సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. గతంలో వైసీపీ పాలనలో జరిగిన అవకతవక లన్నీ బయటకు తీస్తానని తమ పరిపాలనలో అవినీతి చేయాలనుకున్న అధికారులు ఎవరైనా బదిలీలు పెట్టుకుని వెళ్ళిపోవచ్చు అని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మీడియాకు అభినందనలు

కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేయడానికి మీడియా మిత్రుల సహకారం మరువలేనిదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదేవిధంగా మీడియా మిత్రులు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

కాలువలో పెరిగిపోయిన గుర్రపు డెక్కలు

- దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని ఇరిగేషన్ శాఖ

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో ఏలూరు ప్రధాన కాలువలో గుర్రపు డెక్కాలతో నిండిపోయింది. ఏలూరు ప్రధాన కాలువకు నీరు విడుదల కావడంతో రైతులు సార్వా సాగుకు సన్నద్ధమయ్యారు. మండలంలో కాలువపైన ఉన్న వంతెన వద్ద గుర్రపు డెక్కలు పూర్తిగా పేరుకుపోయాయి. దీనితో సార్వా సాగు నీటి ప్రవాహానికి గుర్రపు డెక్కలు ఆటంకం కలిగిస్తున్నాయి. గుర్రపు డెక్కల వలన సాగునీరుకు ఇబ్బందిగా ఉందని రైతులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. నారాయణ పురం వంతెన వద్ద ఉన్న గుర్రపు డెక్కల వలన విపరీతమైన దుర్వాసన వస్తున్నదని ఉంగుటూరు మండల ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షులు బండారు నాగరాజు అన్నారు. ఇరిగేషన్ శాఖ వారు వెంటనే గుర్రపు డెక్కలను తొలగించాలని కోరారు.

ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : ప్రయాణీకులందరికీ ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం,ప్రయాణావసరాలు తీర్చడమే కాకుండా ప్రోత్సాహక బహుమతులు కూడా అందిస్తున్నామని ఆర్. టి. సి. డిపో మేనేజర్ వై ఎస్ ఎన్. మూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక బస్ స్టేషన్ లో ప్రయాణీకుల సమ క్షంలో, లక్కీ డీప్ నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ప్రయాణికులు, యూనియన్ నాయకులు, సూపర్వైజర్లు విచ్చేశారు. లక్కీ డీప్ కార్యక్రమంలో భాగంగా ప్రయాణికు లను ఉద్దేశించి, డిపో మేనేజర్ మాట్లాడుతూ, పాఠశాలలు తెరుస్తున్నం దున, విద్యార్థిని, విద్యార్థులకు బస్సు పాస్ లు ,12 సంవత్సరాల లోపు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, 18 సంవత్సరాల వయసుగల 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిలకు ఇంటి నుండి పాఠశాలకు పాఠశాల నుండి ఇంటికి ఉచిత బస్సు పాసులను అందజేస్తామన్నారు. వికలాంగులకు మూడు సంవత్సరాల కాల పరిమితితో కూడిన బస్సు పాసులను కూడా ఇవ్వడం జరుగు తుందన్నారు. లక్కీ డీప్ విజేతలకు తాడేపల్లిగూడెం జీవి మాల్ షాప్ అండ్ సెలబ్రేట్ వారు ఆర్థిక సౌజన్యంతో బహుమతులను అందజేసారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విశాలాంధ్ర-టి.నరసాపురం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మండల విద్యాశాఖాధికారి టి. రామ్మూర్తి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాల యంలో వేసవి శిక్షణ కార్యక్రమం మగింపు వేడుకలు గ్రంథాలయ పాలకులు ఆర్. కిషోర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామ్మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవరచుకోవా లన్నారు. మండల వైద్యాధికారిణి జె. కల్పనా రాణి మాట్లాడుతూ నేటి విద్యార్థులు సెల్ ఫోన్ లకు బానిసలు కాకుండా పుస్తక పఠనం ద్వారా విజ్ఞాన సముపార్జించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజన్ యు పి స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్, పలువురు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టపడి కాకుండా...ఇష్టపడి చదవాలి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే విజయ శిఖరాలను సులువుగా చేరుకోవచ్చని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. సంస్థలోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీపై 8, 9, 10వ తరగతి విద్యార్థు లకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సెలవుల్లో సైతం ఇక్కడకొచ్చి త్రీడి ప్రింటింగ్ నేర్చుకోవడం అభినందనీయమని కొనియాడారు శిక్షణ పొందిన 44 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ టి.బాబూరావు, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ కార్తికేయ శర్మ, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పు

విశాలాంధ్ర-చాట్రాయి: ఆంధ్ర రాష్ట్ర ప్రజలు విప్లవాత్మకమైన మార్పుకు శ్రీకారం చుట్టారని మైనింగ్ ఇంజనీరింగ్ నిపుణులు, ఎన్నారై పెనుకుదురు రామారావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో అబివృద్ధి కార్యక్రమాలలో వెనుకబడి పోయిందన్నారు. నామినేటెడ్ పోస్టులలో పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగం జరిగిందన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా వాడేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. వారు నామినేటెడ్ పోస్టులు ఇచ్చిన వారికి ఆ బాధ్యతల గురించి కనీసమైనటువంటి ప్రాథమిక అవ గాహన లేని వారికి కూడా పదవులు ఇచ్చారని ఎద్దేవా చేశారు. పేదవారికి నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు చేసే పనులు భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు.

టిడ్కో ఇళ్లను అర్హులకు త్వరితగతిన అప్పగించాలి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: వైకాపా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పరాకాష్టగా నిలిచిన టిడ్కో ఇళ్లను అర్హులైన వారికి త్వరితగతిన పూర్తి చేసి అప్పగించాలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. తాడేపల్లిగూడెం లోని ఆయన నివాసం వద్ద టిడ్కో ఇంజనీర్లతో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కువ ఇళ్ల పరిస్థితి, మౌలిక సదుపాయాల కల్పన, పూర్తికాని గృహ సముదాయాలపై ఆయన ఆరా తీశారు. అర్హులైన వారందరికీ పూర్తయిన ఇళ్లను త్వరితగతిన ఇవ్వాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయేది వర్షాకాలం కావడంతో ఎగువ నుంచి వచ్చే వరద నీరు కిందకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని నిధుల విషయంపై తాను కలెక్టర్ తో మాట్లాడానని తెలిపారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా పనులు మొదలు పెట్టించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఏమాత్రం ఇబ్బంది కలిగిన సహించేది లేదని స్పష్టం చేశారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర -భీమవరం: వేసవి సెలవుల్లో బాలికలకు శిక్షణా శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు గత నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు చిన్నారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని, తరగతులను జయప్రదం చేసిన చిన్నారులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ వేసవి శిక్షణా తరగతులు మే 15 నుండి జూన్ 7 వరకు నిర్వహించామని, బాలల్లో సృజనాత్మక శక్తులు పెంపొందించేలా అనేక అంశాలపై శిక్షణ

అందించామన్నారు. చదువరుల సంఘం అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, శిబిరం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పిల్లలకు వేసవిలో ఈ విధంగా శిక్షణ తరగతులను అందివ్వడం ఒక స్ఫూర్తిదాయకం అన్నారు. అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో విజేతలైన బాలలకు బహుమతులు, చదువరుల సంఘం తరుపున ప్రశంసాపత్రాలను, జన విజ్ఞాన వేదిక తరపున శ్రీనివాస్ ప్రశంసా పత్రాలు బహుమతులు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా కమిషనర్ పర్యావరణ పరిరక్షణ అవగాహన కల్పిస్తూ గ్రంథాలయావరణంలో మొక్కలు నాటారు. రిసోర్స్ పర్సన్స్ ను సత్కరించారు. కార్యక్రమలో చదువరుల సంఘం సభ్యులు పి.పద్మ, పర్యావరణం అధ్యాపకులు శ్రీనివాస్, మాధవి ,రిటైర్డ్ హెచ్ ఎమ్ కలిగొట్ల గోపాల శర్మ, రోటరీ క్లబ్ సభ్యులు షేక్ బాబాజీ, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ , గ్రంథాలయ సిబ్బంది బాలల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు మానవతా సంస్థ సాయం

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కంకిపాటి మోషే కుమార్తె ఒక సంవత్సరంన్నర పాప సత్యశ్రీ మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం శుక్రవారం నారాయణ పురంలో ఉంగుటూరు మానవత పదకొండు వేల రూపాయల సాయం అందించారు. కార్యక్రమంలో సాగిరాజు జానకీ రామ రాజు,పుప్పాల గోపి, గుణ్ణం బుల్లెబ్బాయ్, అడపా శ్రీనివాస్,గంజి రవి , సీతాల సత్యనారాయణ,సూర్యనారాయణ రాజు గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవతా సంస్థనుప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందించారు.

వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులు.. నివారణ చర్యలు

విశాలాంధ్ర - ఉంగుటూరు : వర్షకాలంలో వాతావరణంలో వచ్చే మార్పులతో పశువుల్లో వ్యాధులు వస్తుంటాయని వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి డాక్టర్ మల్లిపూడి చిన బాబురావు అన్నారు. సీజనల్‌లో పశువులకు వచ్చే వ్యాధులపై శుక్రవారం ఉంగుటూరులో రైతులకు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు, ఇతర వ్యాధుల బారి నుంచి పశువులను కాపాడుకోవాలన్నారు. వర్షాకాలంలో పరిసరాల అపరిశుభ్రత, వరద నీళ్ళు, మొలిచిన పచ్చిక గడ్డిపైన ఉండే కీటకాలతో కూడిన మేత తినడం వల్ల గేదెలు, మేకలు, గొర్రెలు, రకరకాల పశువులకు వివిధ రకాల వ్యాధులు సోకి అనారోగ్యానికి గురవుతాయి. దీంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోయి అంటువ్యాధుల బారిన త్వరగా పడతాయన్నారు. చివరకు పశువుల ప్రాణాలు కోల్పోతాయని తెలిపారు.

నివారణ: పశువులకు రైతులు ముందుగా జూన్, జూలైలో వ్యాధి నిరోధక టీకాలు చేయించాలని, వ్యాధి ఉన్న పశువుల దొడ్డిని క్రిమిసంహారక మందులతో క్లీన్ చేయాలన్నారు . వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేసుకోవాలని, వ్యాధి సోకిన పశువుకు వ్యాధి తీవ్రతను బట్టి సల్ఫాడిమిడిన్, ఇంటాసెఫ్‌టాజు, ఎక్సెప్ట్ వంటి ఇంజక్షన్లు ఇవ్వాలన్నారు . మిగిలిన పశువులకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు తగిన సూచనలు , సలహాలు ఇచ్చారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర- ఉంగుటూరు :ఉంగుటూరు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. వేసవి శిక్షణ తరగతుల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ కస్తూరి శిరీష చేతుల మీదుగా బహుమతులు, ప్రశంత పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేసి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. భోజనానికి ముందు, తరువాత విద్యార్థులు చేతులు కడుక్కోవాలని అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు చిట్టూరి గంగాధర్ రావు, తల్లా ప్రగడ భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురంలో పర్యావరణ దినోత్సవం

విశాలాంధ్ర- ఉంగుటూరు : ప్రపంచ పర్యావరణ దినోత్సవ ఉత్సవాలు సందర్భంగా ఉంగుటూరు మండలం నారాయణ పురంలో గ్రామ సర్పంచి దిడ్ల అలంకనంద శ్రీనివాస్ మొక్కలు నాటారు. డిగ్రీ కళాశాల ఆవరణలో, పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జె. నాగేశ్వరరావు, ఎస్. దుర్గాధర్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర - కలిదిండి: స్థానిక గ్రంథాలయ శాఖల్లో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసినట్లు గ్రంథాలయ అధికారి జి. రమేష్‌బాబు తెలిపారు. కలిదిండి శాఖా గ్రంథాలయంలో మే 15 నుంచి నిర్వహించిన ఈ శిబిరాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని ఇప్పటివరకు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిందిగా సూచించారు. చిరిగి చొక్కా అయినా తొడుక్కో వచ్చును కానీ మంచి పుస్తకం కొనుక్కో అన్న మన కందుకూరి వీరేశలింగం పంతులు పుస్తక ప్రాముఖ్యతను ఆనాడే ప్రజలకు వివరించారని అన్నారు. కావున విద్యార్థులు సెల్ఫోన్ వినియోగానికి పరిమితంగా ఉండి పుస్తక పఠానం మక్కువతో చేయవలసిందిగా సూచించారు. వివిధ పాఠశాలల నుంచి 20 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠకులు సాహితీ మిత్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర-ఏలూరు: చాటపర్రు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సర్ సిఆర్ఆర్ కళాశాల విశ్రాంత గ్రంథపాలకులు దొడ్డపనేని రాధాకృష్ణ, బి.కె. ఎం.యు జిల్లా నాయకులు పెంటయ్య, వైష్ణవి జూనియర్ కళాశాల లెక్చరర్ పి. రాము, గ్రంథాలయాధికారి కె.వాసుకి పలువురు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన, వకృత్వం, చిత్రలేఖనం, పేపర్ల అట్టలతోబొమ్మలు తయారు చేయడం మొదలగు వాటిలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు అందజేయడం జరిగింది. గెలుపొందిన బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

శ్రీవాసవిలో నూతనంగా సి.ఎస్.సి. డేటా సైన్స్‌కోర్సు

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం నుండి నూతనంగా సి.ఎస్.సి. డేటా సైన్స్ కోర్సును ప్రారంభించడానికి అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏ. ఐ. సి. టి. సి.) నుండి అనుమతి లభించినట్లు కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు శుక్రవారం తెలిపారు. 60 సీట్లతో ప్రారంభించనున్న ఈ అధునాతన కోర్సు ప్రస్తుతం బహుళ ప్రాచుర్యంలో వున్న కోర్సు అని తెలిపారు. దానితో పాటు ప్రస్తుతం కళాశాలలో నడుపబడుతున్న కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ నందు ప్రస్తుతం ఉన్న 240 కు అదనంగా 60 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ నందు ప్రస్తుతం వున్న180 కు అదనంగా 60 సీట్లు అలాగే పాలిటెక్నిక్ విభాగం లోనూ కంప్యూటర్ ఇంజనీరింగ్ నందు అదనంగా 60 సీట్లు మంజూరు కాబడినట్లు తెలిపారు. నూతనంగా ప్రారంభించనున్న కోర్సు, అదనంగా మంజూరు కాబడిన అదనపు సీట్లకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు ఇప్పటికే కల్పించామని విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా మరిన్ని అధునాతన కోర్సులను ప్రవేశ పెట్టే ఆలోచనలో ఉన్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల. పాలకవర్గ ఉపాధ్యక్షులు కోట్ల వెంకట రామకృష్ణారావు, కోశాధికారి పేరూరి బాల కాశయ్య, సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు, టెక్నికల్ డైరెక్టర్ చక్కా అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకరరావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికునికి సహాయం

విశాలాంధ్ర - తణుకు : ఇటీవల కోనసీమ జిల్లా జొన్నాడ మండలం నర్సిపూడి గ్రామంలో తాపీ మేస్త్రి కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ బిల్డింగ్ పైన పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు హై టెన్షన్ వైర్లు తగిలి తీవ్ర గాయాల పాలై బిల్డింగ్ పై నుండి కిందపడ్డాడు. రాజమండ్రి అభయ హాస్పిటల్ లో చికిత్స తీసుకోవడం జరిగింది. చాలా పేదరికంలో ఉండటం వల్ల ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్న విషయం తెలుసుకుని పశ్చిమగోదావరి జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజమండ్రి వెళ్లి అభయ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న భవనిర్మాణ కార్మికుడు దుర్గా ప్రసాద్ ను పలకరించి అతని ఆరోగ్యం విషయాలు తెలుసుకుని వారి తల్లి గారైన కొప్పిశెట్టి దుర్గ,దుర్గాప్రసాద్ తమ్ముడు వంశీకృష్ణ కి పశ్చిమగోదావరి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నుండి 22 వేల రూపాయలు అందించారు. నెల్లూరు జిల్లా టీపీ కోడూరు మండలం వరిగొండ గ్రామానికి చెందిన పేరం సుబ్బారాయుడు అనే వ్యక్తి కాలికి యాక్సిడెంట్ అయి గాయం మానక అతని కాలు కు ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సూచించడంతో అతని వద్ద ఆపరేషన్ కి డబ్బు లేక తీవ్ర ఇబ్బందులుపడుతున్న సందర్భంగా నెల్లూరు నారాయణ హాస్పిటల్ లో ఉన్న అతనికి 9250 రూ.,అతను ఆపరేషన్ కి జిల్లా సంఘం నుండి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా బిల్డింగ్ వర్కర్స్ అధ్యక్షులు బొల్లాడ నాగరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల ఆదినారాయణ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ మైలవరపు శ్రీరాం బాబు జిల్లా కార్యవర్గ సభ్యులు తణుకు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కొక్కిరిమెట్టి సత్తిబాబు,జిల్లా సహాయకార్యదర్శి సిరిగినీడినాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కొటికలపూడిని కలిసిన బొలిశెట్టి

విశాలాంధ్ర -భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావును తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ భీమవరం లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్తమాన రాజకీయ పరిస్థితులపైనా, మేనిఫెస్టో అమలుపైనా ఇరువురు చర్చించుకున్నారు. పలు విభాగాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

నా విజయం ప్రజలందరి విజయం

విశాలాంధ్ర -పెదవేగి: ఈ విజయం నా ఒక్కడిది కాదు - నా విజయం కోసం కృషి చేసిన ప్రజలందరి విజయం అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వ్యాఖ్యానించారు. దుగ్గిరాలలోని దెందులూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం దెందు లూరు సహా ఏలూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి చింతమనేని ప్రభాకర్ కి శుభాకాంక్షలు తెలిపారు.శుభాకాంక్షలు తెలుపటానికి వచ్చిన ప్రజలందరికీ చింతమనేని ప్రభాకర్ కృతజ్ఞతలు తెలుపుతూ, ఇది తన ఒక్కడి విజయం మాత్రమే కాదని, తన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రతి ఒక్కరి విజయం అని తెలిపారు.

మలేరియా అంతం-మన పంతం

విశాలాంధ్ర - పెంటపాడు: కీటక జనిత ప్రదేశాలను నిలువరిద్దాం సాధారణ జ్వరం అని అశ్రద్ధ చేయవద్దు మలేరియా మాసోత్సవాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెంటపాడు, ముదునూరు లలో వైద్యాధికారులు డాక్టర్ రాజేష్, డాక్టర్ పూజిత,డా.మౌనిక,డా.పవన్ అధ్యక్షతన మలేరియా సబ్ యూనిట్ అధికారి వై వి. లక్ష్మణరావు ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ చలి,జ్వరంతో బాధపడుతున్నవారిని గుర్తించి వారికి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించాలని,పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపు నిచ్చారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలలో ఆరోగ్య కార్య కర్తలు,ఆశాలు, ఆరోగ్య-పర్యవేక్షకులు పాల్గొనగా తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ మలేరియాపై జూన్ మాసం అంతా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి డి. సుజాత, పి.హెచ్.ఎన్. కు వై.సుజాత,ప్రసన్న ఆరోగ్య విస్తరణ అధికారులు చిక్కా సత్యనారాయణ,ఆరోగ్య పర్యవేక్షకులు ఎస్.సత్యనారాయణ, ఆశాలు,ఆరోగ్య కార్యకర్తలు సుసన్న ఆరోగ్య సహాయకులు తేజో నాథ్,సి,వెంకటరమణ, కాంతారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చయ్యచౌదరికి అభినందనలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ శాసనసభ్యులుగా ఎన్నికైన గోరంట్ల బుచ్చయ్య చౌదరిని కొయ్యలగూడెం పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఉప్పాడ పెద్దిరెడ్డి ఆయన క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధిని కోరుకున్న రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వానికి ఓటు రూపంలో తగిన గుణపాఠం చెప్పారని, రాష్ట్రానికి మంచి పరిపాలన అందించాలని పెద్దిరెడ్డి బుచ్చియ్య చౌదరికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఎరుకుల సంఘం అధ్యక్షుడు పోలా రామకృష్ణ, నూతంగి మహేష్, బొబ్బర రమేష్, బబ్లు, తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేకు వెలుగు సిబ్బంది అభినందనలు

విశాలాంధ్ర-మొగల్తూరు: నర్సాపురం ఎమ్మెల్యేగా నూతనంగా ఎన్నికైన బొమ్మిడి నాయకర్ కు శుక్రవారం నరసాపురం కార్యాలయంలో మొగల్తూరు మండల వెలుగు సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకర్ డ్వాక్రా సంఘాల ఓబీ సభ్యులు సిబ్బందితో మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేసి ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలను డ్వాక్రా మహిళలకు సక్రమంగా చేరేటట్లు చూడాలని ఎమ్మెల్యే నాయకర్ సిబ్బందికి సూచించారు. ఏపిఎం ఎం. సుభాషిణి, సిసిలు సుందర్రావు, విజయలక్ష్మి, ఆనంద కుమారి, మోహన్ శ్రీను, మాధవి, ముక్కు దేవి, వివో ఏలు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బయ్యనగూడెం ప్రభుత్వ ఆసుపత్రి ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని సరిపల్లి గ్రామంలో మలేరియా వ్యాధి నిర్మూలన చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సుబ్రమణ్యం మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తగు నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా మలేరియా డెంగ్యూల నుంచి

రక్షణ పొందవచ్చని తెలిపారు. తమ ఇళ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వాడిన నీరు నిలవ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తద్వారా దోమలు విజృంభించకుండా ఉంటాయని ఆరోగ్య పరిరక్షణ కోసం గ్రామస్తులకు పలు సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎస్.కె చాన్ బాషా, హెల్త్ అసిస్టెంట్ యం సుబ్బారావు, ఎం ఎల్ హెచ్ పి ఎం. విమల, ఏ ఎన్ ఎం లు పి. జయప్రద, కే.గంగాదేవి, ఆశా కార్యకర్తలు కె. వెంకటలక్ష్మి, ఎం. వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పార్ధసారధి అనూహ్య విజయం

విశాలాంధ్ర - చాట్రాయి : నూజివీడు శాసనసభ్యుడుగా కొలుసు పార్థసారథి అనూహ్య విజయం సాధించారని రాష్ట్ర కనీస వేతన మండలి సలహా కమిటీ మాజీ సభ్యులు చాగంటి నరసింహారావు కొనియాడారు. చాట్రాయి మండలం పోలవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చాగంటి నరసింహారావు పర్వతనేని నాగేశ్వరరావు శాసనసభ్యులుగా విజయం సాధించిన కొలుసు పార్థసారధిని కలిసి అభినందనలు తెలిపిన అనంతరం మాట్లాడుతూ . బలహీన వర్గాలకు చెందిన సీనియర్ నాయకులైన సారధి ఎన్నికలకు కొద్ది రోజులు ముందు మాత్రమే నూజివీడు వచ్చినప్పటికీ తనకున్న అపారమైన రాజకీయ అనుభవంతో నియోజకవర్గంలోని 87 గ్రామాలు నూజివీడు పట్టణంలో మూల మూలకు వెళ్లి ప్రజలను కలుసుకొని వారికి నమ్మకం కల్పించి ప్రజల మనస్సు దోచుకుని అనూహ్య విజయం సాధించారని అన్నారు. పర్వతనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ. అనుభవజ్ఞుడైన సారధి నూజివీడు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

సంబరాలలో మునిగితేలుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ

విశాలాంధ్ర-పోడూరు: పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ ఊహించని రీతిలో సీటు ఓట్లు సాధించడంతో టిడిపి జనసేన.బీజేపీ నాయకులు సంబరాలలో మునిగితేలుతున్నారు. నాయకులు కార్యకర్తలు గ్రామాలలో సమావేశాలు, చర్చలు అనంతరం విందు భోజనాలతో సంబరాలు చేసుకుంటున్నారు. పోడూరు మండలం ఆచంట పాలకొల్లు నియోజకవర్గాల పరిధిలో ఉంది. అటు పాలకొల్లులో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఇటు మాజీమంత్రి పీతాని సత్యనారాయణ టీడీపీ కూటమి అభ్యర్థులుగా విజయం సాధించడంతో గత మూడు రోజుల నుండి వారి నివాసాల వద్ద నెలకొన్న సందడి ఇంకా తగ్గలేదు. పోడూరు కవిటం, గుమ్మలూరు తదితర 8 గ్రామాల టిడిపి బిజెపి జనసేన నాయకులు కొమ్ముచిక్కాల లోని పీతాని సత్యనారాయణ నివాసానికి వెళ్లి ఆయనను కలిసి అభినందించి వస్తున్నారు వేడంగి, జిన్నూరు, కొమ్ము చిక్కాల పెనుమదం తదితర గ్రామాల టిడిపి జనసేన బిజెపి నాయకులు పాలకొల్లు వెళ్లి నిమ్మల రామానాయుడు కల్లసి అభినందించి తన ఆనందాన్ని పంచుకుంటున్నారు.

బీసీ నేతలకు కందుల కృష్ణ అభినందనలు

విశాలాంధ్ర-చాట్రాయి: తెదేపా యువ, ప్రముఖ నాయకులు మాజీ మంత్రి రవీంద్ర కొనకళ్ళ నారాయణ, పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ను చాట్రాయి మాజీ ఎంపీపీ నూజివీడు నియోజక వర్గ గౌడ్ సంఘం అధ్యక్షులు కందుల కృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం చాట్రాయి మండలం చనుబండ గ్రామానికి చెందిన కందులు కృష్ణ గౌడ సంఘం నాయకులతో కలిసి వెళ్ళి విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కందుల కృష్ణ విశాలాంధ్రతో మాట్లాడుతూ తెదేపా ఆవిర్భావం నుంచి బలహీన వర్గాల నాయకులకు ప్రత్యేకమైన గౌరవం గుర్తింపు దక్కిందని అదేవిధంగా ప్రస్తుత పరిస్థితులలో తెలుగుదేశం పార్టీకే బ్రహ్మరథం పట్టారని అన్నారు. బలహీన వర్గాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న తెలుగుదేశం పార్టీకి నిరంతరం అణగారిన ప్రజలు అండగా ఉండాలని కోరారు.

ప్రజల ఆకాంక్షల మేరకే కూటమి పాలన

విశాలాంధ్ర -ముదినేపల్లి : గత ప్రభుత్వ వైఫల్యాలతో విసుగు చెందిన రాష్ట్ర ప్రజలు ఎన్డీఏ కూటమికి విజయం చేకూర్చడం జరిగిందని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలన సాగిస్తుందని టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు వీరమల్లు నరసింహారావు , జనసేన మండల అధ్యక్షులు వీరంకి వెంకటేశ్వరరావు , బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ , నియోజవర్గ ఫోల్ మేనేజ్మెంట్ ఇంచార్జ్ కొడాలి వినోద్ నివాసంలో ఆయన అధ్యక్షతన కూటమి విజయోత్సవ సభను ముదినేపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రానున్న కాలంలో కూటమి బంధం చివరి వరకు కొనసాగాలని , గ్రామస్థాయిలో అభివృద్ధి , సంక్షేమానికి అందరూ సంయుక్తంగా కృషి చేయాలన్నారు. ఎలాంటి విబేధాలు లేకుండా కలసికట్టుగా ప్రజలకు మంచి పాలన అందించేందుకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తో ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పరసా విశ్వేశ్వరరావు, దారం సుధ, జాస్తి రాజా, నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షులు దావు నాగరాజు, నాయకులు ఏ ఎన్ బాబు, పోసిన పాండురంగారావు , మెడేపల్లి హనుమాన్ ప్రసాద్, పద్మ, రౌతు మాధవి, పంతగాని సురేష్ , భూపతి రవీంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

16న ఏలేశ్వరంలో "స్పార్క్ ఇన్నోవేటివ్ సమిట్"

విశాలాంధ్ర - ఏలేశ్వరం : రాష్ట్రం నుంచి మొట్ట మొదటి శాస్త్రీయ సాంకేతిక ఇన్నోవేటివ్ సమిట్‌ను ఏలేశ్వరంలో స్పార్క్ (సైంటిఫిక్ ప్రోగ్రాం ఫర్ అకాడమిక్ అండ్ రీసెర్చ్ క్యూబ్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఏలేశ్వరంలో నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్ సాయి సందీప్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ చేతుల మీదుగా కాకినాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ అంతరిక్ష, సాంకేతిక విద్య కోసం కృషి చేస్తూ ఎన్నో రికార్డులను సాధించడం అభినదనీయమని అన్నారు. ఎస్పీ ముఖ్య అతిధిగా హాజరయ్యే ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా సాయి సందీప్, స్పార్క్ సంస్థ సభ్యులు కోరారు.

దాడులకు పాల్పడవద్దు -జ్యోతుల

విశాలాంధ్ర - జగ్గంపేట : యువత ఉద్రేక పరిస్థితులకు వెళ్లి దాడులకు పాల్పడవద్దని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచించారు. జగ్గంపేట నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో నెహ్రూ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తును విశ్వసించి ప్రజలు అధికారాన్ని ఇచ్చారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమిని కేంద్రంలోనూ, రాష్ట్రంలోను గెలిపించడం జరిగిందన్నారు. గెలిచిన మనం విజయోత్సవ సంబరాలు చేసుకోవడం తప్పుకాదని, ఐతే పార్టీ అధినేత చంద్రబాబు ఎటువంటి దుశ్చర్యలకు పాల్పవద్దని ఆదేశించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కొందరిపై దాడులు జరిగినట్లు వచ్చిన వార్తలపై చంద్రబాబు స్పందించి ఖండించమని చెప్పడం జరిగిందన్నారు. దాడులు చేసే సంస్కృతి మనదికాదని ఓటమి పాలైన వారు కవ్వింపు చర్యలకు పాల్పడతారని ఉద్రేక పరిస్థితులకు వెళ్లొద్దని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, వీరంరెడ్డి కాశిబాబు, గుడాల రాంబాబు, కాకిలేటి రాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు వదలని నీటిపారుదల శాఖ

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

విశాలాంధ్ర - కాట్రేనికోన : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణ లేదన్న చందాన ఉంది నీటిపారుదల శాఖ తీరు. బొబ్బర్లంక-పల్లంకురు ప్రధాన పంట కాల్వకు వారం రోజులు క్రితమేనీరు విడుదలైంది. ఈ కాలవలో అధికారికంగాఎక్కడ మరమ్మత్తు పనులు జరగడం లేదు. అయినప్పటికీ నీరు వదలకుండా జాప్యం చేస్తున్నారని క్రింది గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. విత్తనాల కాలవ గట్టు సమీపంలో పంట కాలవపై అనుమతి లేకుండా వంతెన నిర్మిస్తున్నారని దీని నిమిత్తం నీటిని నిలుపుదల చేశారని ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ ఉన్నతాధికారులు నీటిని విడుదల చేయించినప్పటికీ ఈ ప్రాంత లస్కర్ నీటిని కిందికి వదలడం లేదనిబాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

సర్వతోముఖ వికాసం పుస్తక పఠనంతోనే సాధ్యం

విశాలాంధ్ర - కాకినాడ : బాల బాలికలు పాఠ్యాంశ గ్రంథాలతో పాటుగా బాల సాహిత్యాన్ని విస్తృతంగా చదవాలని బాలమందిరం వ్యవస్థాపక అధ్యక్షులు అంగర గోపాలకృష్ణ (కృష్ణ శ్రీ) అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం 2024 ముగింపు సభకు కృష్ణ శ్రీ అధ్యక్షత వహించారు. పుస్తకాలు దారి దీపాలని, విజ్ఞాన ద్వారాలని పేర్కొంటూ పుస్తక పఠనం ఆవశ్యకతను గురించి విద్యార్థులకు కృష్ణ శ్రీ వివరించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో కథలు చెప్పడం, కథలు రాయడం, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, ఎంబ్రాయిడరీ, స్పోకెన్ ఇంగ్లీష్, పుస్తక సమీక్ష, నృత్యం తదితర అంశములలో రిసోర్స్ పర్సన్ శిక్షణ అందజేశారు. ముగింపు కార్యక్రమంలో గాంధీనగర్ గ్రంథాలయంలో నిర్వహించిన వ్యాసరచన ,చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్ తదితర పోటీలలో విజేతలకు ముగింపు రోజైన శుక్రవారం విద్యార్థులకు ప్రశంసా పత్రములను అందజేశారు. 23 రోజులపాటు విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరంలో చురుగ్గా పాల్గొని వారి ప్రతిభా పాటవాలు ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారని గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్స్ ఈమని నారాయణమూర్తి, డ్రాయింగ్ రిసోర్స్ పర్సన్ పి వీరబాబు, ఎంబ్రాయిడరీ రిసోర్స్ పర్సన్ ఏ పద్మావతి, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి మండలం దేవరపల్లి మండలం గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోగౌరీపట్నం దుద్దుకూరు గ్రామాలలో శుక్రవారం నాడు మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు గౌరీపట్నం పిహెచ్‌సి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో సిహెచ్‌ఓ ఏ శ్రీకృష్ణుడు మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ముఖ్యంగా పరిసరాలలో మురికికుంట లేకుండా చూసుకోవాలని కొబ్బరి బొండాలు లో నీరు లేకుండా చూసుకోవాలని అన్నారు ముఖ్యంగా ఇండ్లలో ఫ్రిజ్లు గ్రైండర్లు ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలని అన్నారు. దోమల వలన మలేరియా వ్యాప్తి చెందుతుందని దోమలు లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు గౌరీపట్నం పిహెచ్సి ఎంత సూపర్వైజర్ యు అశోక్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా ప్రజలు దోమల వలన అప్రమత్తంగా ఉండాలని దోమలు లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఇదేవిధంగా పరిసరాలలో నీరు నిలవ ఉండకుండా చూసుకోవాలి అన్నారు. ముఖ్యంగా డ్రైనేజీల నుండి నీరు ఎప్పటికప్పుడు బయటికి వెళ్లే విధంగా చూసుకోవాలని అన్నారు. ఈ ర్యాలీలో ఏఎన్ఎం లు ఎంఎల్ హెచ్‌పి లు ఆశ వర్కర్లు నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో...

మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియాపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. జూన్ 31 తేదీ వరకు నిర్వహించే మహెూత్సవాల సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఆర్.ఎస్.ఎస్.వి ప్రసాద్ మాట్లాడుతూ మలేరియా అనేది చలి, వణుకు విపరీతమైన జ్వరం తో కూడుకున్న వ్యాధి అని, ఇది ప్లాస్మోడియం అనే పరాన్నజీవి వల్ల వస్తుందన్నారు. ఈ వ్యాధి అనాఫిలస్ దోమ ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలుగా, వర్షాకాలంలో దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలన్నారు. సరైన వ్యాధి నిర్ధారణ, చికిత్స లేకపోతే నెలల తరబడి బాధిస్తుందన్నారు. మలేరియాకు సంబంధించిన పలు సూచనలు, సలహాలు సిబ్బందికి ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం, ఆరోగ్య పర్యవేక్షకులు జీన్నూరి శ్రీనివాస రావు, పబ్లిక్ హెల్త్ నర్స్ కేడివిఎల్ కుమారి, ఆరోగ్య సిబ్బంది, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ పాల్గొన్నారు.

గ్రంధాలయంలో విజ్ఞాన శిబిరం ముగింపు

విశాలాంధ్ర - తాళ్ళపూడి : తాళ్లపూడి శాఖా గ్రంథాలయం నందు వేసవిజ్ఞాన శిబిరం ముగుంపు కార్యక్రమం నిర్వహించారు. గుండుబోగుల ఆదినారాయణ, రీడర్స్ ఫామ్స్ అధ్యక్షులు సి.ఎచ్ ఆంజ నేయులు, రిటైర్డ్ ఎం.ఈ.ఓ. తాళ్లపూడి పోస్ట్ మాన్ సి.హెచ్.నాగలింగం, మరికొందరు చదువరులు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లోవిద్యార్థులతో పుస్తక పఠనం చేసారు. వేసవి విజ్ఞాన శిబిరం గురించి, గ్రంథాలయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఆటలు పోటీలు గెలిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. గ్రంథాలయ అధికారి ఏ. నరేష్ మాట్లాడుతూ తాళ్లపూడిలో ఉన్న శాఖా గ్రంథాలయంలో విద్య, వైద్య, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో వున్నాయని చదువరులు వీటిని ఉపయోగించు కోవాలని గ్రంథాలయ సభ్యత్వాన్ని తీసుకోవాలని కోరారు. పి సత్యనారాయణ సిద్ధాంతి, ఎం సత్యనారాయణ, త్రినాథ్, ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలకు ప్రచారం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: మండల కేంద్రం ఉండ్రాజవరం, ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాల కోసం శుక్రవారం కళాశాల అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. ఉండ్రాజవరం, తాడిపర్రు, వెలగ దుర్రు తదితర గ్రామాలలో పదో తరగతి ఉత్తీర్ణలైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, వారి వారి తల్లిదండ్రులను కలిశారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పథకాల గురించి వివరించారు. ఎంపీసీ, సీఈసీ గ్రూపులకు సంబంధించి పూర్తి స్థాయిలో అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. పలువురు విద్యార్థుల నుంచి ప్రవేశ దరఖాస్తులు స్వీకరించినట్లు కళాశాల అధ్యాపకులు మాణిక్యాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఉదయ భాస్కరరావు, ఎస్. శ్రీనివాసరావు, పి.నిరీక్షణరాజు, బి.పద్మజారాణి, జి. అజూబ, జి. మహేశకుమార్, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

వాడపల్లి రూట్‌లో ట్రాఫిక్ మళ్లింపు

బొబ్బర్లంక, రావులపాలెం రహదారిలో ట్రాఫిక్ మళ్లింపు

వాడపల్లి గుడికి వెళ్ళే భక్తులు ద్విచక్ర వాహనాల్లో వెళ్ళాలి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : బొబ్బర్లంక నుంచి రావులపాలెం వెళ్ళే రహదారిలో ఈనెల 8, 9 తారీకుల్లో ట్రాఫిక్‌ను మళ్ళిస్తున్నట్లు సీఐ ఎం రామకుమార్ తెలిపారు. ప్రముఖ సినీ హీరో షూటింగ్ నిమిత్తం ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 8, 9 తేదీల్లో బొబ్బర్లంక నుంచి రావులపాలెం వైపు వచ్చే నాలుగు చక్రాల వాహనాలు భారీ వాహనాలు, కార్లు, లారీలు, ట్రాక్టర్‌లు, బస్సులు ధవలేశ్వరం బ్యారేజ్ దాటుకుని వేమగిరి, కడియం జొన్నాడ, రావులపాలెం బ్రిడ్జి మీదుగా రావులపాలెం చేరుకోవాల న్నారు. వాడపల్లి గుడికి వెళ్ళే వారు ద్విచక్ర వాహనాల్లో చేరుకోవాలని సూచించారు. అలాగే రావుల పాలెం నుంచి బొబ్బర్లంక వెళ్లే వాళ్ళు రావులపాలెం హైవే మీదుగా వేమగిరి నుంచి బొబ్బర్లంక చేరుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు యధావిధిగానే బొబ్బర్లంక రావులపాలెం రహదారిలో రావచ్చని చెప్పారు. తప్పకుండా తమ సూచనలను పాటించి ప్రయాణికులు, వాహనదారులు సహకరించాలని కోరారు. అయితే హీరో ఎవరన్నది క్లారిటీ లేకపోయినా హీరో రామ్ చరణ్ అన్నట్టు తెలుస్తుంది.

వైసీపీ ఘోర పరాజయానికి కారణం

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్

ఫలించిన టీడీపీ ప్రచారం

విశాలాంధ్ర - అమలాపురం : జగన్ రెడ్డి మళ్ళీ వస్తే మీ భూములు ఇళ్లు లాగేసుకుంటాడు. సెక్రటేరియట్‌ని తాకట్టు పెట్టినట్టు మీ భూములు ఇళ్లు తాకట్టు పెట్టేస్తాడు జాగ్రత్త పడండి అంటూ తెలుగుదేశం పార్టీ చేసిన ప్రచారం చాప కింద నీరులా ప్రజల్లో పాకీ తీవ్ర ప్రభావం చూపించి జగన్ నాయకత్వంలోని వైకాపా గడిచిన ఎన్నికల్లో ఘోర పరాజయానికి ప్రధాన కారణం అయ్యింది. అది తెలుగుదేశం పార్టీకి నిశ్శబ్ద విప్లవంలా మారి భారీ మెజారిటీలో ఓట్ల సునామీ సృష్టించి అధికారాన్ని కట్టబెట్టింది. జగన్ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల తమకు మేలు జరుగుతుందని భావించిన వైకాపా నాయకత్వం నెత్తిన అదే భస్మాసుర హస్తంగా మారింది. ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమం పైనా జగన్ బొమ్మ వేసుకోవడం అనే దురాచారం ఆ పార్టీ కొంప ముంచింది. జగన్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటినుండి ప్రజలకు అందించే ప్రతి పత్రం పైనా జగన్ ఫోటో వేసుకునే సంప్రదాయాన్ని కొనసాగించింది. రేషన్ కార్డు, హెల్త్ కార్డు మొదలు ప్రతి దానిపై జగన్ బొమ్మ వేసి జనాల్లో రోత పుట్టించారు. ఆ నేపథ్యంలో కేంద్రం పంపిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను జగన్ ప్రభుత్వం చట్టం చేస్తూ అన్నింటి లాగానే భూమి పట్టాలపైనా సరిహద్దులో పాతిన రాళ్లపైనా ఆశ కొద్దీ జగన్ బొమ్మలు వేసి భూ యజమానులకు అందజేశారు. అవి చూసిన భూయజమానులు మా భూమి పత్రాలపై జగన్ బొమ్మ ఏమిటంటూ నిట్టూర్పులు చేసిన ప్రశ్నిస్తే ఎక్కడ కేసులు పెడతారోనని భయపడి మిన్నకున్నారు. ఎన్నికల్లో జగన్‌ని ఎదుర్కొనేందుకు వేసిన పాచికలు పారని తెలుగుదేశం సరిగ్గా ఎన్నికలు పదిరోజులు ఉన్నాయన్నగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ని బ్రహ్మాస్త్రంలా ప్రయోగించింది. మీ భూములు, ఇళ్లు అమ్మేసేందుకు లేదా తాకట్టు పెట్టేందుకు జగన్ మోహన్రెడ్డి కుట్ర చేస్తున్నాడని పట్టాలు సరిహద్దు రాళ్లపై తన బొమ్మలు వేసుకున్నాడని, జగన్ మళ్లీ వస్తే మీ భూములు సంగతి అంతే అంటూ చేపట్టిన ప్రచారం ప్రతి ఓటరు మొబైల్‌లో మారు మోగించారు. పాడిందే పాడటం ఓటర్లని ఆలోచనలో పడేసింది. ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ జరిగింది. ఆఖరికి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన 32 లక్షల ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు కూడా సందిగ్ధంలో పడేసింది. జగన్ అస్తమనూ అనే నా ఎస్సీలు నా ఎస్టీలు నా బిసిలు నా మైనారిటీలలో సైతం తమ భూములు స్థలాలు ఎక్కడ పోతాయో అన్న ఆలోచన రేకెత్తించింది. ఈ చర్చ చివరకు పోలింగ్ బూత్‌ల క్యూ లైన్‌లలో సైతం ఓటర్లు నిలబడి చర్చించుకున్నారంటే తెలుగుదేశం చేసిన ప్రచారం ఎంతగా ప్రభావం చూపిందో తెలుస్తోంది. తెలుగుదేశం చేస్తున్నా ప్రచారాన్ని ఆలస్యంగా గుర్తించిన వైకాపా దాన్ని తిప్పికొట్టడంలో ఘోరంగా విఫలమైంది. ఒకటి రెండు రోజులు ప్రకటనలు చేసి మిన్నకున్న వైకాపా దాన్ని గాలికొదిలేసింది. కేంద్రం పంపిన చట్టం ఇది అని చెప్పడంలో వైకాపా విఫలమైంది. బీజేపీ గాని కేంద్రం గానీ ఇది మేము పంపిన చట్టమే అని ఎక్కడా చెప్పిన పాపాన పోలేదు. ఫలితంగా వైకాపాకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ల్యాండ్ మైన్‌గా మారి ఎన్నికల్లో ఘోర మైన ఓటమిని కట్టబెట్టింది.

ఏమిటీ విధ్వంసకర చర్యలు?!

మోరంపూడి ఎఫ్‌ఓబీ శిలాఫలకం ధ్వంసం దేనికీ?

పేపర్ మిల్లు వద్ద ఓ కార్యాలయం విధ్వంసం, సీతంపేటలో ఒకరిపై దాడి..

రాజమండ్రి మాజీ ఎంపీ భరత్ ఆవేదన

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఇంకా కొలువు తీరలేదు.. రాజమండ్రిలో మాత్రం విధ్వం సకర ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో పలుచోట్ల చోటు చేసుకున్న విధ్వంసకర సంఘటనా స్థలాలను మాజీ ఎంపీ భరత్ స్వయంగా పరిశీలించారు. మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన శిలా ఫలకాన్ని ధ్వంసం చేశారు. అలాగే రాజమండ్రి పేపర్ మిల్లు సమీపంలో ఓ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. సీతంపేట లో ఒక వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయ పరిచారు. అతని తలకు బలమైన గాయ మైంది. సమాచారం తెలుసుకున్న భరత్, నగర వైసీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, వైసీపీ నేతలు పాలిక శ్రీనివాస్, ఎన్వీ శ్రీనివాస్ తదితరులు ఆయా సంఘటనా ప్రాంతాలకు వెళ్ళి పరిస్థితిని సమీక్షించారు. పోలీసులతో మాట్లాడి వివరాలు తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడుతూ రాజమండ్రి ప్రశాంతమైన నగరమని, ప్రజలు భయాం దోళనలకు గురయ్యేలా ఎవరూ వ్యవహరించ కూడదని అన్నారు. నగరంలో ఒకసారి కేన్సిల్ అయిన మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జిని తిరిగి శాంక్షన్ చేయించడానికి జాతీయ రహదారి అధికారులు, కేంద్ర ప్రభుత్వంతో ఏ విధంగా తలపడి సాధించాననే విషయం నగర ప్రజలందరికీ తెలుసన్నారు. ఈ మోరంపూడి జంక్షన్ వద్ద వేలాది ప్రమాదాలు సంభవించి వందలాది మంది ప్రాణాలు పోయాయన్నారు. దానిని దృష్టిలో ఉంచుకుని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ ఫ్లై ఓవర్ బ్రిడ్జి శాంక్షన్ చేయించానని చెప్పారు. శంకుస్థాపనకు నేషనల్ హైవే మినిస్టర్ గడ్కరీ వచ్చారని, అటువంటి శిలాఫలకాన్ని ఎందుకు ధ్వంసం చేశారో అర్థం కావడం లేదన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రజాప్రతినిధులు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నా నగరం అభివృద్ధి చెందితే సంతోషమేనని, కానీ ఇటువంటి విధ్వంసకర సంఘటనలతో ప్రజలలో ఆందోళనలకు తావివ్వడం ఎట్టి పరిస్థితుల్లోనూ మంచిది కాదన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, పాలకులు శ్రద్ధ తీసుకోవాలని మాజీ ఎంపీ భరత్ విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రాన్ని గాడిన పెడతాం

మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : తప్పులు చేయాలి... గత పాలకులపై దాడులు చేసి విధ్వంసాలు చేయాలన్న ఆలోచనలు తమకు మచ్చుక్కైనా లేవని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని ఎన్నికల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఐదు కోట్ల ప్రజా నీకం తమకు మద్దతుగా నిలిచారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయమని, గాడి తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెడతామన్నారు. రాష్ట్రానికి రాజధాని నిర్మిస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమాన్ని అమలు చేస్తామన్నారు. కేంద్రం నుంచి మన రాష్ట్రానికి ఇంకేమైనా రావాల్సి ఉంటే వాటన్నింటీ తీసుకువస్తామన్నారు. ప్రజలు అవకాశం ఇచ్చారు కదా అని వైకాపా వారిపై దాడులు చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. మోరంపూడి ఫ్లై ఓవర్ వంతెనను మంజూరు చేయించిన మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ పేరును ఈ ఐదేళ్ళల్లో ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడంతో తమ నాయకులు, కార్యకర్తల్లో ఆవేదన బాధ ఇప్పుడు బయటకు వస్తోందన్నారు. తమ పెద్ద పండుగ మహానాడు వేమగిరిలో జరుగుతున్న నేపథ్యంలో తమ ఫ్లెక్సీలు, తోరణాల మధ్య వారి ఫ్లెక్సీలు తోరణాలు కట్టడం ఏంటని ప్రశ్నించారు. సంస్కృతి గురించి మాట్లాడుతున్న ఆ మాజీ ప్రజాప్రతి నిధి నాడు సంస్కృతికి పక్కన పెట్టేసారా అని ప్రశ్నించారు. అమరావతి పాదయాత్ర జరుగుతుంటే మహిళలు, రైతులపై దాడి చేయడం సంస్కృతా..? అన్యాయంగా అరెస్టు కాబడి జైల్లో ఉన్న తన భర్త నారా చంద్ర బాబు నాయుడు క్షేమంగా విడుదల కావాలని భువనేశ్వరి 22వ డివిజన్‌లోని వినాయకుడి ఆలయంలో పూజలు చేసుకునేందుకు వెళుతుంటే ఉద్దేశ పూర్వకంగా అధికారంలో ఉన్నా మన్న అహంకారంతో మొదటి పూజ మేమే చేసుకోవాలని భరత్ రామ్ ప్రవర్తించిన తీరు సంస్కృతా అని ప్రశ్నించారు. ఉదయం మోరం పూడి జంక్షన్‌లో చోటు చేసుకున్న సంఘటన నేపథ్యంలో తాను వద్దని వారించా నన్నారు. ఈ ఐదేళ్లల్లో అల్లకల్లోలంగా మార్చిన నగరాన్ని ప్రశాత నగరంగా తీర్చి దిద్దుతామన్నారు. అనాలోచితంగా చేపట్టిన పనులన్నింటిని సరి చేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మీడియా సమావేశంలో జనసేన రాజమండ్రి సిటీ ఇన్‌ఛార్జ్ అత్తి సత్యనారాయణ, టీడీపీ నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, నగర కమిటీ కార్యదర్శి కిలపర్తి శ్రీనివాస్, నగర బీసీ సెల్ అధ్యక్షులు బుడ్డిగ రవి తదితరులు పాల్గొన్నారు.

కూటమికి కాపు సామాజిక వర్గం అండ

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్రంలో ఉన్న కాపు సామాజిక వర్గీయులు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి అత్యధిక శాతం మంది ఓట్లు వేశారని అందువల్లే భారీ విజయం సాధించినట్లు రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాష్, నల్లా విష్ణులు అన్నారు. జనసేనాని పవన్ కాపు సామాజిక వర్గం ఓట్లు కూటమికి వెళ్లేలా చేయించడంలో చాలా సఫలీకృతులయ్యారని వారు పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడలోని శుభం కాపు కళ్యాణ మండపంలో రాష్ట్ర కాపు జేఏసీ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ మహాకూటమి విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాష్, నల్లా విష్ణులు ప్రసంగించారు. అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడంలో కాపు సామాజిక వర్గీయుల పాత్ర మరువలేనని, ఎన్డీఏ కూటమికి మెజారిటీ ఇచ్చి కూటమిని అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. కూటమి ప్రభుత్వంలో కాపు సమస్యలు, అభివృద్ధి, సంక్షేమం, కార్పొరేషన్, రిజర్వేషన్ వంటి అంశాలపై దృష్టి సారించాలని వారు కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, ప్రధాని మోడీలతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ సభ్యులందరికీ రాష్ట్ర కాపు జేఏసీ తరుపున వారంతా ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో కాపు జేఏసీ నాయకులు బసవా ప్రభాకర రావు, బివిఎస్ మూర్తి, రొక్కం సూర్య ప్రకాష్, సంజీవ్ కుమార్, నల్లా పవన్, జానపాముల నాగబాబు, రామదేవు సీతయ్య దొర, అడబాల సత్యనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.

దేశంలోనే ప్రథమ కోర్సు 'జిఎస్ఎల్'లో ప్రారంభం

విశాలాంధ్ర - రాజానగరం : వివిధ రోగాలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరాన్ని బట్టి ఉపశమనాన్ని కల్పించేందుకు చేపట్టే శస్త్రచికిత్సలో నైపుణ్యాలను పెంపొం దించుకునేందుకు ఫ్యూజ్ కోర్సు దోహదపడుతుం దని ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ జైసా ఓలాస్కీ పేర్కొన్నారు. మండలంలోని జిఎస్ఎల్ వైద్య కళాశాల నందు జీఎస్ఎల్ వైద్య కళాశాల, అమెరికా గ్యాస్ట్రోఇంటెస్టినల్ మరియు ఎండోస్కోపిక్ సర్జన్ల సొసైటీ సంయుక్త భాగస్వామ్యంతో దేశంలో మొదటి సారి "ఫ్యూజ్" కోర్సును జిఎస్ఎల్ నందు శుక్రవారం ప్రారంభించారు.కార్యక్రమానికి అమెరికా నుండి విచ్చేసిన వైద్యులు జ్యోతి ప్రజ్వలన చేసి నూతన కోర్సు ప్రారంభించారు. న్యూయార్క్‌లో జాకబ్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్, బయో మెడికల్ సైన్సెస్, బఫెలో కి చెందిన ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సర్జరీ చైర్మన్, ఫ్యూస్ కోర్సు స్థాపకులు డాక్టర్ స్టీవెన్ షెెట్జ్‌బర్గ్, సట్టర్ ఈస్ట్ బే మెడికల్ గ్రూప్, సాన్ ఫ్రాన్సిస్కో జనరల్ సర్జన్ డాక్టర్ పాస్కల్ ఫుచ్‌షుబెర్, వర్సిటీ ఆఫ్ కొలరాడో హాస్పిటల్, డెన్వర్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ సర్జరీ డాక్టర్ ఎడ్వర్డ్ జోన్స్, స్టోనీ బ్రూక్ యూనివర్సిటీ హాస్పిటల్, న్యూ యార్క్ జనరల్ సర్జన్ డాక్టర్ కింగా పవర్స్ వంటి సీనియర్ సర్జన్లు కోర్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్ఎల్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ గన్ని భాస్కర రావు మాట్లాడారు. విదేశీ వైద్యులను జిఎస్ఎల్ యాజమాన్యం దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. జిఎస్ఎల్ వైద్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్,వివిధ శాఖల అధిపతులు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు అంకితభావంతో సేవలందించాలి

మీడియా సమావేశంలో మాజీ మంత్రి మల్లాడి

విశాలాంధ్ర - యానం : ఆంధ్రప్రదేశ్ లో నూతనంగా ఎంపికైన ప్రజాప్రతినిధులం దరూ సేవా భావంతో ప్రజలకు మంచి పరిపాలన అందించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. యానంలో గురువారం సాయంత్రం ఎర్ర గార్డెన్స్‌లో ఆయన సగృ హంలో ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో ఆయన మాట్లాడారు. తనకు తెలుగు దేశం పార్టీ స్థాపించిన ఎన్టీ రామారావుతో సాన్నిహిత్యం ఉందని. అలాగే అప్పటి ఆంధ్రా ముఖ్యమంత్రులతో అందరితో సాన్నిహిత్యం ఉందని తెలిపారు. ముఖ్యంగా దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డితో అనుబంధం గురించి వివరిం చారు. తాను మత్స్యకార నాయ కుడిగా, మత్స్యకారులకే కాకుండా బిసి సోదరులకు ఎవరికైనా అన్నివిధాలా సహాయపడడంతో తనకున్న మంచిపేరుతో అన్ని పార్టీలు నన్ను ఆదరించాయిని అన్నారు. ఇప్పుడు గెలిచిన ఆంధ్రప్రదేశ్ ఎమ్ఎల్ఏలు కొందరు మంత్రులు కూడా కావచ్చు అని అన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతి నిధులకు సందేశం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కు మంచిరోజులు వచ్చాయన్నారు. గతంలోలా కాకుండా కేంద్రంలో బిజెపికి మీ అవసరం ఉందని, కాబట్టి ఆంధ్రప్రదేశ్‌కి ఉపయోగపడే విధంగా కావలిసినవి అన్నీ సాధించుకోవ చ్చునని తెలిపారు. జగన్ మోహన్ రెడ్డికి గ్రౌండ్ రియాలిటీ తెలియ చెప్పేందుకు చాలాసార్లు ప్రయత్నించానని. ఆయన చుట్టూ ఉన్న కోటరీ, కాకినాడలో ఉన్న ప్రముఖ రెడ్డి మాటలువిని నా మాటలు పెడచెవిన పెట్టారన్నారు. జక్కంపూడి రాజా మాట్లాడిన మాటలు అక్షర సత్యాలని, ఇప్పటి కైనా గ్రహించుకుంటే మరలా పార్టీని పునర్నిర్మిం చుకునే అవకాశం ఉంటుం దన్నారు. తనపుట్టిన రోజున వేలాదిమంది వచ్చి తనపై ఇంత అభిమానం చూపించి నందుకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

ఘనంగా వేసవి విజ్ఞాన శిబిరాల ముగింపు

విశాలాంధ్ర - కాకినాడ : ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి నాగమణి మాట్లాడుతూ మనిషి సంపదను దాచుకోగల దేమోగానీ, జ్ఞానాన్ని దాచిపెట్టలేడని, తాను కనుక్కున్నదీ, అనుభవించిందీ, ఆలోచించిందీ ఎదుటివారితో పంచుకోవాలనే తపనే భాష, లిపిల పుట్టుకలకు కారణమని, రాసిన అన్నింటి నీ నిర్దేశిత స్థలంలో అందరికీ అందు బాటులో ఉంచాలనే ప్రాథమికభావనే గ్రంథాలయాలకు మూలమన్నారు. ప్రజల ఉపయోగార్థం అన్నిరకాల పుస్తకాలను ఒకేచోట చేర్చి రక్షించే ప్రదేశాన్ని గ్రంథాల యం అని అంటారని, గ్రంథాలయం అనగానే అందరికి గుర్తుకు వచ్చేది ఒక్కటే, అక్కడ అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయి అని, చిన్నపిల్లల నుండి పెద్దవారి దాక అందరికి అవసరమైన బుక్స్ ఒక గ్రంథాలయంలోనే ఉంటాయన్నారు. మరొక అతిథి డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయా లు జ్ఞానా నికి వేదికలని, గ్రంథ పఠనం అజ్ఞాన హరణమని, గ్రంథాలయాలు ఇలలో కొలువైన దేవాలయాలన్నారు. సంస్థ కార్యదర్శి విఎల్ఎన్ ఎస్ వరప్రసాద్ మాట్లాడుతూ దైవం కొలువున్న ప్రదేశం దేవాలయమైతే, జ్ఞాన జ్యోతిని వెలిగించే ఇలలో నెలవైన నిజమైన దేవాలయం గ్రంథాలయమన్నారు. 25 రోజులు వచ్చిన విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ & పేపర్ క్రాఫ్ట్‌పై శిక్షణ ఇచ్చిన బి సూర్యనారాయణను, సాఫ్ట్ కమ్యూనికేషన్ స్కిల్స్ పై శిక్షణ ఇచ్చిన ఎంసత్యబాల, ఉపాధ్యాయురాలిని, సంగీతం & మోరల్ కథలు పై శిక్షణ ఇచ్చిన టిఎస్ లక్ష్మీ కుమారి, ఆర్‌టిడి టీచర్‌ను, జికె & జనరల్ అవేర్నెస్ పై శిక్షణ ఇచ్చిన పి సోమన చౌదరి, ఆర్‌టిడి టీచర్‌ను, డ్రాయింగ్ పై శిక్షణ ఇచ్చిన డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడును, పప్పెట్ షో పై శిక్షణ ఇచ్చిన పి గోవింద రాజులు, ఉపాధ్యాయుడును, మ్యాజిక్ & జాతీయ గీతాల పై శిక్షణ ఇచ్చిన విఎస్‌వి రమణమూర్తి, కెశ్రీని వాసరావు, విరామారావు, పిరవిశంకర్, ఉపా ధ్యాయుడును, నృత్యం & సంగీతం పై శిక్షణ ఇచ్చిన ఎంబిఎస్ దేవి, టీచర్‌ను దుశ్శాలు వాతో సత్కరించి మెమెంటోలు అందించారు.

కెయిర్న్ ఆయిల్ & గ్యాస్ నికర జీరో ప్రయత్నాలు

విశాలాంధ్ర - కాకినాడ : వేదాంత గ్రూప్‌లో భాగం, భారతదేశం లోని ప్రముఖ ప్రైవేట్ చమురు, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి సంస్థ అయినకెయిర్న్ ఆయిల్ & గ్యాస్పర్యావరణ, సామాజిక, కార్పొరేట్ గవర్నెన్స్ (ఈ ఎస్ జి) నాయకత్వానికి మార్గదర్శకత్వం వహించడం ద్వారా ఈపి వాల్యూ చెయిన్ అంతటా2030 నాటికి నెట్ జీరో కార్బన్‌గా మారనుంది. బహుముఖ వ్యూహంలో భాగంగా, కెయిర్న్ ఈఎస్ జీరోడ్‌మ్యాప్ కార్బన్ ఉద్గారాల తగ్గింపు, పునరుత్పాదక ఇంధన వనరులు, ప్రకృతి-ఆధారిత కార్బన్ పరిష్కారాలు లాంటివాటిని కలిగిఉంటుంది.వ్యర్థాల నుంచి శక్తి, కార్బన్ క్యాప్చర్ వినియోగం నిల్వ (సి సి యు ఎస్) వంటి ఆవిష్కరణలను అవలంబిస్తుంది. దీనితో, కెయిర్న్ 2030 నాటికి నికర జీరో కార్బన్‌ను పొందాలనే లక్ష్యాన్ని వేగంగా సాధించే దిశలో ఉంది.

కార్బన్ ఆధారిత ప్రకృతి పరిష్కారాల ద్వారా భూమి పునరుద్ధరణ:

ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం థీమ్ భూమి పునరుద్ధరణ, ఎడారీకరణను నిలిపివేయడం, కరువును తట్టుకునే శక్తిని నిర్మించడంపై కేంద్రీకృతమై ఉంది. కెయిర్న్ జీవవైవిధ్య పరిరక్షణ కార్యక్రమాలు, ప్రకృతి పునరుద్ధరణ కార్యకలాపాలు రాజస్థాన్, ఆంధ్ర ప్రదేశ్, గుజరాత్‌లలో సంస్థ కార్యకలాపాలు కొనసాగే ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. 2030 నాటికి 2 మిలియన్ మొక్కలను నాటాలని కెయిర్న్ యోచిస్తోంది.

బంగారు పతకం సాధించిన సుధకు ఘన సన్మానం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : గణపతి సచ్చిదానంద స్వామి దత్తపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత పోటీ పరీక్షల్లో బంగారు పతకం సాధించిన ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామానికి చెందిన లక్ష్మీ ఘనచక్ర ఉమా మహేశ్వరి (సుధ) దంపతులను వివేకానంద సేవా సమితి సభ్యులు, పలు పార్టీల నాయ కులు, హిందూ ధార్మిక సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజక వర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, బిజెపి, టీడిపి నాయకులు, గ్రామ పెద్దలు కలిసి ఆమెను పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తాళ్లూరి గొల్లజీరావు, పంతం పద్మనాభం, నల్లలశెట్టి వీరబాబు, అద్దూరి కోటేశ్వరరావు, మల్లెపాక నాగేంద్ర, కుర్ర గోవింద్ పాల్గొన్నారు.



ఇది ప్రజల విజయం : జనసేన పార్టీ నేతలు

విశాలాంధ్ర - కరప : కరప గ్రామంలో జనసేన పార్టీ నాయకులు భోగిరెడ్డి కొండబాబు, భోగి రెడ్డి గంగాధర్, యాళ్ల వీర వెంకట సత్యనారాయణ జనసేన నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి స్వీట్లు పంచుతూ జనసేన పార్టీ విజయానికి కృషి చేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు ఐదు సంవత్సరాల కాలంలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరిం చేందుకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కృషి చేస్తారని యాళ్ళా వీర వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుణ్యమంతుల వీరవెంకులు, పేపకాయల రాజు, చిన్నారి వీరభద్ర రావు, అప్పారావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

తాళ్ళపూడి గోదావరిలో మహిళ మృతదేహం

విశాలాంధ్ర- తాళ్ళపూడి : తాళ్ళపూడిలోని పాత లాంచీల రేవులో గోదావరి నదిలో గుర్తు తెలియని మృతదేహం ఒకటి నది ఒడ్డుకు కొట్టుకొచ్చింది. నదిలో లభ్యమైన మృతదేహం, ఎరుపు అంచు ఆకుపచ్చ రంగు చీర కట్టుకుని, ఎరుపు రంగు శరీర ఛాయ కలిగి ఉందని, సుమారు 50 సంవత్సరాలు వుంటాయని పోలీస్‌ల సమాచారం. ఈ మహిళ మృతదేహం కుమారదేవం గ్రామానికి చెందిన భవాని అని గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యామ్ సుందర్ తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్రీజర్‌లో భద్ర పరిచినట్లు తాళ్ళపూడి ఏ.ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఇది రాష్ట్రానికి శుభపరిణామం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాకినాడ సిటీ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), కాకినాడ రూరల్ నియోజకవర్గం నుండి కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వహక కార్యదర్శి, పాయకరావుపేట నియోజకవర్గం పరిశీల కులు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు వారి ఇంటి వద్దకు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలంతా ఏకపక్షంగా కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం జరిగిందని, ప్రజలలో గత ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకత అలాగే చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ మీద ప్రజలకు ఉన్న నమ్మకం ఇంతటి ఘన విజయానికి కారణం అని, అలాగే గత ప్రభుత్వంలో ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలు తిప్పి కొట్టారని, కొండబాబు నాయకత్వంలో కాకినాడ సిటీని అభివృద్ధి పదంలో నడిపించాలని, రూరల్ ఎమ్మెల్యే నానాజీ రూరల్ నియోజకవర్గం అభివృద్ధి చేయడం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా అసెంబ్లీ స్థానాలతో పాటు అత్యధిక పార్లమెంటు స్థానాలను కూడా కూటమి ప్రభుత్వం కైవసం చేసుకున్న సందర్భంగా కేంద్రంలో మన రాష్ట్రానికి ఎన్నడూ లేనంత ప్రాముఖ్యత సంతరించుకుందని, ఇది రాష్ట్రానికి శుభ పరిణామం అని చంద్రబాబు నాయుడు విజనరీ, పవన్ కళ్యాణ్ ముందు చూపే దీనికి ప్రధాన కారణమని, వీరి ఇద్దరి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవడం ఖాయమని అన్నారు. వీరితో పాటుగా కరప మండలం యండమూరు జనసేన గ్రామ అధ్యక్షులు గంజా దుర్గాప్రసాద్, యండమూరు గ్రామ వార్డు మెంబర్ మేడిశెట్టి పాండురంగ, సాయి, కొండ తదితరులు పాల్గొన్నారు.

మీ కృషి మరువలేను

ఎమ్మెల్యే పంతం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ రూరల్ టీడీపీ కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతుల స్వగృహం నందు జరిగిన ఎన్నికలలో నిస్వార్థంగా గెలుపుకు సహకరించిన పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులను పట్టు వస్త్రాలు అందించి శాలువాతో కుటుంబ సమేతంగా జనసేన పార్టీ కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసన సభ్యులు పంతం నానాజీ సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం మాట్లాడుతూ నా గెలుపు కోసం శ్రమించిన మీకు రుణపడి ఉంటానని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.